క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత శ్యామ్ వెంకట్ కుటుంబానికి విరాళం బాండ్ పత్రాలను అందిస్తున్న సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన చోడిశెట్టి శ్యామ్ వెంకట్ శనివారం రూ.2,00,232 విరాళంగా అందజేశారు. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాలను అందించారు.

శ్రీవారి క్షేత్రంలో తగ్గిన భక్తుల రద్దీ



తూర్పురాజగోపుర ప్రాంతంలో నామమాత్రంగా ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ తగ్గింది. సాధారణంగా ప్రతి శనివారం వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శిస్తుంటారు. షష్ఠి సందర్భంగా ఆలయానికి నామమాత్రంగా భక్తులు విచ్చేశారు. ఆలయ అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, తూర్పు రాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లలో భక్తుల రద్దీ తక్కువగా కనిపించింది.

పారిజాతగిరి వెంకన్నకు విశేష పూజలు



ఆర్డీఓకు ప్రసాదాలను అందిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. స్వామి వారిని అయ్యప్ప, భవానీ, గోవింద, ఆంజనేయస్వామి స్వాములు, భక్తులు, ఆర్డీఓ ఎంవీ రమణ దర్శించుకున్నారు. అర్చకులు నల్లూరి రవికుమార్, రిషికేష్, రాఘవాచార్యులు ఆలయ కార్యనిర్వాహధికారి ఆలయం మర్యాదలతో ఆర్డీఓకు స్వాగతం పలికి, పూజల అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, వేదాశీర్వాదం అందజేశారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు, రెడ్డి రంగప్రసాద్, మదాల రామ మోహనరావు, వాసవి సాయి నగేష్, ఉప్పాల గంగాధర్ పర్యవేక్షించారు.

14న జాతీయ లోక్‌అదాలత్



జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబర్ 14వ తేదీ శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సీహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. కోర్టు ప్రాంగణంలో శనివారం బార్ అసోసియేషన్ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చని ఆయన అన్నారు. న్యాయవాదులు పోలీసులు కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి, ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని కోరారు.

సూరిబాబు మృతి తీరని లోటు



సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ శ్రీధర్, నాయకులు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, సొసైటీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ ఏపూరి సూరిబాబు మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఇటీవల పుప్పాలవారి గూడెంలో గుండెపోటుతో మరణించిన సూరిబాబు చిత్రపటానికి శ్రీధర్, పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరిబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ లింగపాలెం మండల అధ్యక్షుడు కొటారి మోహన్, రాష్ట్ర లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సుంగా సందీప్, నాయకులు చలికాని చిట్టయ్య, ఓబిళ్లనేని ప్రభాకర్‌రావు, ఇనుగంటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కష్టకాలం

- ప్రభుత్వాస్పత్రుల్లో చాలీచాలని వేతనాలు
- 6 నెలలుగా అందని జీతాలు
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

బుట్టాయగూడెం: ప్రభుత్వాస్పత్రుల్లో పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగ భద్రత కరువైంది. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనలతో విధులు నిర్వహిస్తున్నారు. పెరిగిన ధరలు ఒకవైపు వేధిస్తుండగా, మరో వైపు చాలీచాలని వేతనాలు కూడా ఆరు నెలల నుంచి అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుట్టాయగూడెం, పోలవరం, జంగారెడ్డిగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో 50 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు ఆస్పత్రి పరిసర ప్రాంతాలు, వార్డులు, గదులు నిత్యం శుభ్రం చేస్తున్నా.. పనికి తగిన వేతనం లభించడం లేదు. విధుల్లో ఏదైనా ప్రమాదం జరిగినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొర జీతాలు

ప్రస్తుతం నెలకు కనీసం రూ.30 వేలు లేనిదే ఇంట్లో గడవని పరిస్థితి ఉంది. తమకు రూ.10 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని సీహెచ్‌సీ కాంట్రాక్టు కార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను పర్మినెంట్ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతున్నారు. తమకు రావాల్సిన ఆరు నెలల జీతాల బకాయిలు చెల్లించాలని ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బుట్టాయగూడెం సీహెచ్‌సీలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న కార్మికులు

ఆరేళ్లుగా పనిచేస్తున్నా



ఆరేళ్లుగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కార్మికురాలిగా పనిచేస్తున్నాను. అప్పటి నుంచి చాలీచాలని జీతంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మాకు ఆరు నెలలుగా జీతాలు కూడా రావడంలేదు. చాలా ఇబ్బందిగా ఉంది. జీతాల బకాయిలను ఇప్పించాలి.

– మంచేల సుజాత, కార్మికురాలు, బుట్టాయగూడెం సీహెచ్‌సీ

జీతాలు పెంచాలి



ఆస్పత్రితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు కష్టపడి పనిచేస్తున్నా మాకు కనీస వేతనం ఇవ్వడంలేదు. చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నాం. మా ఉద్యోగాలకు భరోసా కల్పించాలి. మాకు హెల్త్ కార్డులు ఇవ్వాలి.

– ముప్పిడి సుందరమ్మ, కార్మికురాలు, బుట్టాయగూడెం సీహెచ్‌సీ

మా సేవలను గుర్తించాలి



ఆస్పత్రిలోనే పొద్దంతా వ్యర్థ పదార్థాలను తొలగిస్తాం. ఆస్పత్రి పరిశుభ్రంగా ఉండే విధంగా పనిచేస్తాం. ఆస్పత్రికి వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేలా కృషి చేస్తున్నాం. మా సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదు.

– నంది ధర్మరాజు, కార్మికుడు, బుట్టాయగూడెం సీహెచ్‌సీ

సుమనోహరం.. సుబ్బారాయుడి కల్యాణం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన చెరువు వీధిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అర్చకులు, పండితులు శైవాగమం ప్రకారం సుముహూర్త సమయంలో వధు వరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. తలంబ్రాల వేడుక నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఉంచి క్షేత్ర పుర వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా షష్ఠి వేడుకలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రధాన ఆలయమైన వల్లీదేవసేన సమేత సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీనివాసపురం రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు, రామచంద్రాపురం, విజయ దుర్గ అమ్మవారి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద శనివారం షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఆయా ఆలయాల్లో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి సేవలో బాలరాజు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం నందాపురం సమీపంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల్లో శనివారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో మంచి ఆరోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బన్నే బుచ్చిరాజు, ఆలయ కమిటీ బాలరాజును ఘనంగా సన్మానించారు. ముప్పినవారిగూడెం రామాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.



ద్వారకాతిరుమల : స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న దుర్గాప్రసాద్



బుట్టాయగూడెం : సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు



పోలవరం : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజ చేస్తున్న అర్చకుడు

భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు

కొయ్యలగూడెం: స్థానిక టెంపుల్స్ సెంటర్ సుబ్రహ్మణ్య స్వామి, తాడేపల్లిగూడెం రోడ్డులోని సుబ్బారాయుడు, కన్నాపురం, మంగపతిదేవిపేట, బోడిగూడెం, దిప్ప కాయలపాడు, రాజవరం, నరసన్నపాలెంతో సహా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో షష్ఠి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. బయ్యనగూడెం స్వామివారిని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దర్శించుకున్నారు. వాసవి గ్రాఫిక్స్ అధినేత సాలన సుధాకర్ సౌజన్యంతో స్వామివారి పాకెట్ క్యాలెండర్లను బాలరాజు చేతులు మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం మండలంలో..

టి.నరసాపురం: స్థానిక కాశీ విశ్వేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, నవీన దంపతుల ఉభయ ధారులుగా వ్యవహరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. చిన్న గురవయ్యగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం, అన్న సమారాధన నిర్వహించారు.

పోలవరం మండలంలో..

పోలవరం రూరల్: మండలంలోని పోలవరం, పట్టిసీమ, ప్రగఢపల్లి, గుంజవరం గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. పోలవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద కొణతాల కుటుంబీకులు అన్నసమారాధన ఏర్పాటుచేశారు.



జంగారెడ్డిగూడెం : సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



కొయ్యలగూడెం : బయ్యనగూడెంలో ఆలయం వద్ద భక్తుల క్యూ



టి.నరసాపురం : కాశీ విశ్వేశ్వర ఆలయంలో స్వామి కల్యాణం

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు 14 నుంచి నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నట్టు ఇరిగేషన్ డీఈ రాంబాబు తెలిపారు. కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం కుడి, ఎడమ కాలువల పరిధిలో 5 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం, లక్కవరం, పంగిడిగూడెం, అమ్మపాలెం, కొయ్యలగూడెం మండలం రాజవరం సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఒకో సంఘానికి 12 మంది టీసీ (టెరిటోరియల్ కానిస్టెన్సీ) ఉంటారని, ఈ 12 మంది కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌ని ఎన్నుకుంటారని తెలిపారు. 5 సంఘాల చైర్మన్లు కలిసి ఎర్రకాలువ ప్రాజెక్టు చైర్మన్‌ని ఎన్నుకుంటారని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో 14 చెరువులు, కామవరపుకోట మండలంలో 7, టి.నర్సాపురం మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయని, ఒక్కో చెరువుకి ఆరుగురు టీసీ ఉంటారు. వీరిలో ఒకచైర్మన్, వైస్ చైర్మన్‌ని ఎన్నుకుంటారని డీఈ తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ

కామవరపుకోట: మండలంలో తడికలపూడిలోగల ఎన్‌టీఆర్ నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికారత ప్రాంగణంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.రెబక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వృత్తి విద్యలో రెండు నెలల శిక్షణకు 8వ తరగతి చదివి, 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్హత, ఆధార్ ధ్రువీకరణ, రెండు ఫొటోలతో దరఖాస్తును తడికలపూడి మహిళా ప్రాంగణంలో అందజేయాలని తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా ముత్తయ్య

టి.నరసాపురం: ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా ముదర్ల ముత్తయ్య, అధికార ప్రతినిధిగా నార్లపాటి ప్రసాద్ నియమితులయ్యారు. శనివారం టి.నరసాపురంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నేత, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విస్సంపల్లి సిద్దు విలేకర్లతో మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డపాటి పండు మాదిగ, తుట్టి ఈశ్వరరావుదొర, చెప్పుల ఏసు, పేరయ్య, నార్లపాటి దుర్గారావు పాల్గొన్నారు.

నేడు సోలార్‌పై సదస్సు

జంగారెడ్డిగూడెం: పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై స్థానిక ఆలపాటి గంగా భవాని కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. రూ.1180 రిజిస్ట్రేషన్ ప్రక్రియతో ఈ పథకం ప్రారంభమవుతుందని, గరిష్ఠ సబ్సిడీ రూ.78,000 లభిస్తుందని పేర్కొన్నారు. సదస్సులో విద్యుత్ అధికారులు, బ్యాంకు అధికారులు సోలార్ రూఫ్ టాప్ వెండార్స్ పాల్గొంటారని, విద్యుత్ గృహ వినియోగదారులంతా హాజరుకావాలని కోరారు.

10న పోలవరం నిర్వాసితుల మహా సదస్సు



సభలో మాట్లాడుతున్న సీపీఐ నేత మునీర్

వేలేరుపాడు: స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 10న నిర్వహించే ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఏడు మండలాల నిర్వాసితుల మహా సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్ అన్నారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నిర్వాసితులంతా సదస్సుకు హాజరుకావాలని కోరారు. నిర్వాసిత సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని చెప్పారు. సదస్సుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరలు హాజరవుతారన్నారు. సమావేశంలో నాయకులు కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబు, పిట్టా ప్రసాద్, మడివి కామయ్య పాల్గొన్నారు.

హస్త కళల్లో మహిళలు రాణించాలి

చింతలపూడి : హస్త కళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు హస్త కళ సేవా కేంద్రం విజయవాడ సహాయ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి అన్నారు. స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్‌లో శనివారం హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్మెంట్ కమిషనరేట్ సహకారంతో హస్త కళాకారులకు ఒక రోజు సెమినార్ నిర్వహించారు. అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ హస్త కళల్లో నైపుణ్యం పెంపొందించుకునేలా నిర్వహిస్తోన్న గురు శిష్య 2 నెలల శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హస్తకళాకారులు రూపొందించిన వస్తువులను వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించేలా చేసి వాటి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేయడమే కేంద్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చింతలపూడి లాంటి గ్రామీణ ప్రాంత మహిళలకు కూడా హస్తకళలపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. షేర్ అండ్ షేడ్ డైరెక్టర్, కన్సల్టెంట్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం హస్త కళల్లో మహిళలు రాణించేలా కృషి చేస్తామన్నారు. ఆజాద్, జయానంద్, ఫిలిప్, టి.జెరూష్, సత్యవేణి పాల్గొన్నారు.



హస్తకళలపై మహిళలకు సూచనలిస్తున్న అపర్ణ లక్ష్మి

ఉపాధితో పాటు ఆదాయం పెంపునకు కృషి

బుట్టాయగూడెం: గిరిజనులకు ఉపాధి కల్పించడంతోపాటు ఆదాయ వనరులను పెంచడమే వన్‌దన్ వికాస్ కేంద్రాల లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.ధాత్రిరెడ్డి అన్నారు. మండలంలోని మారమూల గ్రామమైన నాగంపాలెంలో ఏర్పాటు చేసిన వన్‌దన్ వికాస్ కేంద్రాన్ని జేసీ శనివారం సందర్శించారు. గ్రామంలోని గిరిజన మహిళల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన అడ్డాకుల విస్తర్ల తయారీ మెషీన్‌ను ఆమె పరిశీలించారు. గిరిజనులు అడవిలో సేకరించిన ఉత్పత్తుల ద్వారా వన్‌దన్ కేంద్రాల్లో తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకాన్ని వినియోగించుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చలపతిరావు, వెలుగు ఏపీడీ రాజబాబు, ఏపీఎం పద్మావతి, ఏటీడబ్ల్యూఓ శ్రీవిద్య, డ్రీమ్‌డే సొల్యూషన్ కన్సల్టెన్సీ కంపెనీ వ్యవస్థాపకులు శ్వేత, తదితరులు పాల్గొన్నారు.



వన్‌దన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, తదితరులు

నాణ్యమైన భోజనం అందడం లేదు

జంగారెడ్డిగూడెం రూరల్: గత ప్రభుత్వంలో అమలైన విధంగా ప్రస్తుత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం అమలు కావడం లేదంటూ మండలంలోని లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించడం లేదని తల్లిదండ్రులు విరోధుల పుష్ప, నిద్రబింగి హైమలతలు వాపోయారు. సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. పట్టెన్నపాలెంలో సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు, శ్రీనివాసపురం పాఠశాలలో జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడారు.

సమస్యలపై నిలదీసిన తల్లిదండ్రులు

బుట్టాయగూడెం: స్థానిక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను నిలదీశారు. ఏకలవ్య పాఠశాలలో సమస్యలపైనా వివరించారు. వీటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బుట్టాయగూడెం హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. తెల్లవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేరెంట్స్‌తో కలిసి భోజనం చేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

చింతలపూడి : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. స్థానిక సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైస్కూల్ హెచ్‌ఎం మురళీ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు. చింతలపూడి హైస్కూల్‌లో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్ పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు.



లక్కవరం హైస్కూల్‌లో పేరెంట్స్, టీచర్ల సమావేశం

విలువలతో కూడిన విద్యను అందించాలి

జంగారెడ్డిగూడెం: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఆర్డీఓ ఎంవీ రమణ సూచించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమ్మేళనంలో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. డీఎస్పీ యు.రవిచంద్ర చట్టాలపై అవగాహన కల్పించారు. జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పేరెంట్ మీట్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పాల్గొని మాట్లాడారు.

తల్లితండ్రుల పాత్ర కీలకం

పోలవరం రూరల్: పాఠశాలల అభివృద్ధిలో తల్లితండ్రుల పాత్ర కీలకమని ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అన్నారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. మండలంలో 60 పాఠశాలల్లో తల్లితండ్రుల సమావేశం నిర్వహించామని ఎంఈఓ జె.సురేష్ బాబు తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి

టి.నరసాపురం: విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. టి.నరసాపురం, బొర్రంపాలెంలలో నిర్వహించిన పేరెంట్ మీట్‌లో ఆయన మాట్లాడారు.



చింతలపూడిలో బ్రోచర్ ప్రదర్శిస్తున్న ఎస్పీ, అధికారులు

పంగిడిగూడెం పాఠశాలలో..

ద్వారకాతిరుమల: పంగిడిగూడెం హైస్కూల్లో హెచ్‌ఎం పి.సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సీఐ యుజే విల్సన్, ఎస్సై టి.సుధీర్‌లు సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: మెగా పేరెంట్స్ సమావేశాలు లింగపాలెం మండలంలోని పాఠశాలల్లో నిర్వహించారు. ప్రత్యేక అధికారి వి.జయప్రకాష్ పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ నజీముల్లాస, ఎంఈఓ కంటా రామారావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం మండలంలో..

కొయ్యలగూడెం: మెగా పేరెంట్స్ టీచర్స్ డే వేడుకలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ జె.సురేష్ బాబు మాట్లాడారు. కొయ్యలగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో టాపర్లకు స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బలుసు నాగేశ్వరరావు ఏటా మాదిరిగానే నగదు పురస్కారం అందజేశారు.

మత్తుపదార్థాలతో ఆరోగ్యానికి హానికరం

పోలవరం రూరల్: మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యానికి హానికరమని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ సత్యవతి అన్నారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో మత్తు పదార్థాలు, నాటుసారా వల్ల వచ్చే అనర్థాలపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ జి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.